


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 23-09-2026 సంపుటి : 08 సంచిక 94 పేజీలు : 8 వెల : రూ 3-00


# తిరువూరులో రూ.14 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం



ఎన్టీఆర్ జిల్లా, సెప్టెంబర్ 22: జిల్లాలోని తిరువూరు పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. తిరువూరులో మధిర రహదారి అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (ఊంఓ) పథకం ద్వారా రూ.14 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి వర్చువల్‌గా కార్యక్రమాన్ని ప్రారంభించగా, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మధిర రోడ్డులో భూమిపూజ నిర్వహించి పనులను మొదలుపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ఐఎస్‌బీ రోడ్ల తరహాలో, అమరావతిలోని సీడ్ యాక్సిస్ రోడ్ల మాదిరిగా తిరువూరులో మధిర రోడ్డును అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారి, రవాణా సౌకర్యాలు అందించడంతో పాటు పట్టణ మౌలిక వసతులను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు చెప్పారు. రూ.14 కోట్లతో చేపట్టనున్న పనులు పూర్తయితే మధిర రోడ్డు రూపురేఖలు మారనున్నాయని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డప్పు కొట్టి, డ్యాన్స్ వేసి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఏ.కుమార్, మున్సిపల్ కమిషనర్ కె.మనోజ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# వందేమాతరం ఆలపించకపోవడం నేరం కాదు.. చర్యలకు వీల్లేదు : సుప్రీంకోర్టు



వందేమాతరం గీతాన్ని ఆలపించలేదన్న కారణంతో వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. మతపరమైన విశ్వాసాలు లేదా మనస్సాక్షికి సంబంధించిన కారణాలతో ఎవరైనా ఈ గీతాన్ని పాడటానికి నిరాకరిస్తే వారిపై ఎటువంటి శిక్షార్హమైన చర్యలు ఉండబోవని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. అదే సమయంలో జాతీయ గీతంగా వందేమాతరం హోదాను న్యాయస్థానాలు సమీక్షించలేవని కూడా స్పష్టంచేసింది.ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు టీఎం కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి మోహనలతో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలన్న కేంద్ర ప్రభుత్వ సర్క్యులర్‌ను, అలాగే జాతీయ చిహ్నాలను అవమానించకుండా నిరోధించే చట్టం-2026 సవరణను టీఎం కృష్ణ సవాల్ చేశారు.గీతంలోని చివరి నాలుగు చరణాలలో హిందూ దేవతల ప్రస్తావన ఉండటం రాజ్యాంగబద్ధమైన లౌకిక స్ఫూర్తికి, మత స్వేచ్ఛకు విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. వందేమాతరం సుదీర్ఘ కాలంగా జాతీయ గీతంగా కొనసాగుతోందని, దాని హోదాను తాము ప్రశ్నించలేమని వ్యాఖ్యానించింది. అయితే ఆర్టికల్స్ 25, 26 ప్రకారం మత విశ్వాసాలు లేదా వ్యక్తిగత విచక్షణ కారణంగా ఎవరైనా ఈ గీతాన్ని పాడటానికి అభ్యంతరం వ్యక్తం చేస్తే, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోలేమని ధర్మాసనం స్పష్టంచేసింది.వ్యక్తులు తమ ఇష్టానుసారం ఒకటి లేదా అంతకంటే ఎక్కువ చరణాలను పాడవచ్చని లేదా అస్సలు పాడకుండా ఉండవచ్చని కోర్టు అభిప్రాయపడింది. 1986 నాటి చరిత్రాత్మక బిజో ఇమ్మాన్యుయేల్ కేసులో మత విశ్వాసాల కారణంగా జాతీయ గీతాన్ని పాడలేమని కోరిన జెహోవా సాక్షుల విభాగానికి చెందిన విద్యార్థులకు సుప్రీంకోర్టు రక్షణ కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తుచేసింది. ప్రాథమిక హక్కులను ప్రాథమిక విధులు అధిగమించలేవని ఆ తీర్పు స్పష్టం చేసిందని పేర్కొన్నది.ప్రస్తుత పిటిషన్‌లో కేవలం క్రిమినల్ చర్యలకు సంబంధించిన అంశాన్ని మాత్రమే పరిశీలిస్తామని, గీతంలోని సాహిత్యంపై లేదా దాని అధికారిక హోదాపై ఎటువంటి తీర్పు ఇవ్వబోమని న్యాయస్థానం వెల్లడించింది.

## 52 వార్డుల్లో 1.99 లక్షల మంది ఓటర్లు--

### మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబరు 22: నంద్యాల పట్టణంలోని 52 వార్డుల్లో మొత్తం 1,99,238 మంది ఓటర్లు ఉన్నారని మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న తెలిపారు. ఇందులో 96,672 మంది పురుషులు, 1,02,488 మంది మహిళలు, 78 మంది ఇతరులు ఉన్నారని వెల్లడించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం 52 వార్డుల ఓటర్ల జాబితాను కమిషనర్ బి. శేషన్న అధికారికంగా విడుదల చేశారు.ఓటర్ల జాబితాలో ప్రతి అర్హుడి పేరు ఉండేలా, అనర్హుల పేర్లు లేకుండా క్షుణ్ణంగా పరిశీలించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే గుర్తించి సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమని, ఎలాంటి లోపాలకు తావులేకుండా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని బి. శేషన్న స్పష్టం చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కె. కళ్యాణిబాయి, ఎంఈ నాగభూషణం రెడ్డి, డీఈలు పవన్ కుమార్, రసూల్, టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహమూర్తి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విక్రమ్, శానిటేషన్ సూపర్‌వైజర్లు మురళీధర్, శివప్రసాద్ రెడ్డితో పాటు మున్సిపల్ సిబ్బంది. సచివాలయ సిబ్బంది. పాల్గొన్నారు.



## ప్రతిపక్షంలో ఉన్నప్పుడే భయపడలేదు.. ఇప్పుడు భయపడతామా జగన్?!: మంత్రి లోకేశ్

అనంతపురం, సెప్టెంబర్ 22: గురువులపై దాడి చేసిన గొడ్డలి పార్టీ రౌడీ బ్యాచ్ ఎక్కడున్నా వదలమని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. అండమాన్‌లో ఉన్నా, ఆస్ట్రేలియాలో ఉన్నా వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. మంగళవారం రాప్తాడు నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తల సమావేశంలో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ మాట్లాడారు.ఈ సందర్భంగా విజయవాడ శాప్ కార్యాలయం వద్ద సోమవారం చోటు చేసుకున్న సంఘటనపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ.. తనపై కోపం ఉంటే తేల్చుకుందాం.. రా.. టీచర్ల జోలికొస్తే సహించేది లేదంటూ వైసీపీ నేతలపై ఆయన మండిపడ్డారు.డేట్, టైమ్ ఫిక్స్ చేయి... డీఎస్సీతో పాటు ఏపీపీఎస్సీ, కల్తీ మద్యంపై కూడా చర్చిద్దామని వారికి మంత్రి లోకేశ్ సవాల్ విసిరారు. నీతి, నిజాయితీలతో బతికిన కుటుంబం తమదని ఈ సందర్భంగా గుర్తు



చేశారు. సీఎం చంద్రబాబుపై ఒక్క ఆరోపణ అయినా నిరూపించగలిగారా? అంటూ వైసీపీ నేతలను ఆయన నిలదీశారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడే భయపడలేదు.. ఇప్పుడు భయపడతామా జగన్?! అంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎంకు ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ చురకలంటించారు.

# నంది అవార్డులకు ఏపీ సర్కార్ గ్రీన్‌సిగ్నల్



అమరావతి, సెప్టెంబర్ 22: ఏపీలో నంది అవార్డుల సందడి మొదలుకానుంది. సినీ, టీవీ రంగాలకు ఏపీ సర్కార్ గుడ్‌న్యూస్ చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో నంది అవార్డుల నిర్వహణకు అనుమతినిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు( జారీ చేసింది. 2012 నుంచి 2024 వరకు పెండింగ్‌లో ఉన్న నంది అవార్డులతోపాటు, 2025 అవార్డులను ఒకేసారి నిర్వహించేందుకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2012-2016 కాలానికి చెందిన నంది, జాతీయ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నవంబర్ 2026లో విజయవాడలో నిర్వహించనున్నట్లు పేర్కొంది. 2017-2024, 2025 సంవత్సరాల నంది అవార్డులకు సంబంధించి జ్యూరీ కమిటీల ఏర్పాటును సెప్టెంబర్ 2026 నాటికి పూర్తి చేయాలని ఆదేశించింది. 2017-2024, 2025 అవార్డుల విజేతల జాబితాను నవంబర్ 2026లో అధికారికంగా ప్రకటించాలని ఉత్తర్వుల్లో వెల్లడించింది.2017 నుంచి 2024 సంవత్సరాలకు సంబంధించి ప్రతి ఏడాదికి గాను 1వ, 2వ ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌లు, రెండు స్పెషల్ జ్యూరీ అవార్డులను మాత్రమే అందజేయనున్నట్టు ఉత్వర్వుల్లో పేర్కొంది. టీవీ విభాగంలో 2017-2024 కాలానికి ప్రతి ఏటా 1వ, 2వ ఉత్తమ మెగా సీరియళ్లు, రెండు స్పెషల్ జ్యూరీ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపింది. నంది ఫిల్మ్ అవార్డుల (2017-2024 ఓ 2025) వేడుకను డిసెంబర్ 2026లో అమరావతి/విజయవాడలో నిర్వహించనున్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడించింది. అలాగే, నంది టీవీ అవార్డుల (2017-2024 ఓ 2025) ప్రదానోత్సవాన్ని డిసెంబర్ 2026లో తిరుపతిలో నిర్వహించనున్నట్లు ఏపీ ప్రభుత్వం ఉత్వర్వుల్లో పేర్కొంది.

## ఏపీ పంచాయతీరాజ్ శాఖలో బదిలీలు..

అమరావతి, సెప్టెంబర్ 22: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖలో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ జిల్లాలకు గ్రామీణ పంచాయతీ అధికారులు, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారులు, జిల్లా ప్రజాపరిషత్ డిప్యూటీ సీఈవోలుగా బాధ్యతలు అప్పగించింది. పశ్చిమ గోదావరి జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా వి.విజయభాస్కర్ నియమితులయ్యారు. అమలాపురం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా పి.వసంత మాధవి బాధ్యతలు చేపట్టనున్నారు. అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారిగా ఎస్.మంజుల వాణి, అనకాపల్లి డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా కె.రమామణి నియమితులయ్యారు.అలాగే, సత్యసాయి జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా ఎం.వెంకటరత్నం బాధ్యతలు చేపట్టనున్నారు. కదిరి డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా వి.రామాంజనేయులు నియమితులయ్యారు.







# సంపాదకీయం

బుధవారం 23-09-2026

## ఇమేజ్ దిగజార్చుకుంటున్న రాహుల్...

ఇండియా కూటమి పార్టీల నుంచే పూర్తిస్థాయిలో ప్రధానమంత్రి అభ్యర్థిగా ఆమోదం పొందలేక తంటాలు పడుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తన చేష్టల ద్వారా ఇమేజ్‌ను మరింత దిగజార్చుకుంటున్నారు. మధ్యప్రదేశ్‌లో ఛాత్రోంకి గూంజ్ పేరుతో నిర్వహించిన ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు తావిచ్చింది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మధ్యప్రదేశ్లోని ఇండోర్‌లో నిర్వహించిన ఛాత్రోన్ కీ గూంజ్ యువజన సదస్సులో పాల్గొనడం రాజకీయంగా తీవ్ర దుమారానికి దారితీసింది. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీతో పాటు పాల్గొన్న స్టాండప్ కమెడియన్ పుల్కిత్ మాని , ప్రధాని నరేంద్ర మోదీ విదేశాంగ విధానాలు, ఆయన మాట్లాడే శైలిని అనుకరిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యంగ్య ప్రదర్శనలో ప్రధాని మోదీ దివంగత తల్లిని ఉద్దేశించి చేసిన కొన్ని వ్యాఖ్యల పట్ల రాహుల్ గాంధీ స్టేజ్‌పైనే బిగ్గరగా నవ్వుతూ కనిపించడం వివాదానికి అసలు కారణమైంది. ఈ ఘటనపై భారతీయ జనతా పార్టీ తీవ్రస్థాయిలో మండిపడింది. రాజకీయాల్లోకి తల్లులను లాగడం, వయోవృద్ధులైన మహిళలను కించపరిచేలా వ్యవహరించడం కాంగ్రెస్ పార్టీ దిగజారిన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని బీజేపీ నేతలు విమర్శించారు. కేంద్రమంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు స్పందిస్తూ.. ప్రధాని మోదీ తల్లిపై పరోక్షంగా జోకులు పేలుస్తుంటే రాహుల్ గాంధీ బాధ్యతారహితంగా నవ్వడం ఆయన నైతిక దివాలాకోరుతనానికి అద్దం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వైపు ప్రధాని మోదీ వృద్ధులను గౌరవిస్తూ సంప్రదాయాలను పాటిస్తుంటే, మరోవైపు రాహుల్ గాంధీ మాత్రం అటువంటి అగౌరవాన్ని ప్రోత్సహిస్తున్నారని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో కుటుంబ రాజకీయాలు, వ్యక్తిగత దూషణలు సాధారణమైపోతున్నాయనే విమర్శల మధ్య, ఈ ఉదంతం మరోసారి అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధాన్ని తారాస్థాయికి చేర్చింది. రాజకీయ విమర్శలు సిద్ధాంతపరంగా ఉండాలి కానీ, ఒక వ్యక్తి కుటుంబ సభ్యులను, ముఖ్యంగా దివంగత తల్లులను లక్ష్యంగా చేసుకుని అగౌరవపరచడం భారతీయ సంస్కృతికి విరుద్ధమని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ తరహా ధోరణి ప్రజాస్వామ్య విలువలను దిగజార్చేలా ఉందని, కాంగ్రెస్ పార్టీ నాయకత్వం క్షమాపణ చెప్పాలని సోషల్ మీడియాలో డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి ఓ స్టాండప్ కమెడియన్‌తో కలిసి దేశ ప్రధాని నరేంద్ర మోదీని, చనిపోయిన ఆయన మాతృమూర్తిని అలాగే వృద్ధులను కించపరిచేలా ఒక వివాదాస్పద స్కిట్‌ను ఆయన ప్రోత్సహించడం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. మిలియన్ల మంది ఈ వీడియోను వీక్షించారు. అది గొప్పగాకాంగ్రెస్ చెప్పుకుంటోంది. కానీ ఒక ప్రధానమంత్రి పదవిని ఆశిస్తున్న జాతీయ స్థాయి నాయకుడు ఈ స్థాయికి దిగజారి ప్రవర్తించడం మాత్రం ప్రజల మనసుల్లో ముద్రపడిపోతుంది. కాంగ్రెస్ శ్రేణులు దీన్ని ఏదో మాస్ అప్పీల్‌గా భావించి రాహుల్ గాంధీని తెగ పొగిడేస్తున్నారు. కానీ, రాజకీయం కోణంలో ఇది పూర్తిగా నిస్సిగ్గుగా సాగే దిగజారుడు ప్రవర్తనే అవుతుంది. ప్రత్యర్థి పార్టీ విధానాలను, పరిపాలనను సైద్ధాంతికంగా లేదా ప్రజా సమస్యల ఆధారంగా ఎండగట్టాల్సింది పోయి, వ్యక్తిగత దూషణలకు దిగడం రాజకీయ విలువలను పూర్తిగా దిగజార్చడమే. కేవలం చప్పట్లు, ఈలల కోసం దేశ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిని, కుటుంబ నేపథ్యాన్ని కించపరిచేలా వ్యవహరించడం రాహుల్ రాజకీయ పరిణతిలేమికి అద్దం పడుతోంది. ఈ చౌకబారు ప్రచారం స్వల్పకాలికంగా సోషల్ మీడియాలో హడావుడి చేసినప్పటికీ, దీర్ఘకాలంలో కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా తీవ్ర నష్టాన్ని చేకూరుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రతిపక్షాలు చేసే ఇలాంటి వ్యక్తిగత విమర్శలను, దూషణలను భారతీయ జనతా పార్టీ రాజకీయంగా ఎంత సమర్థంగా తనకు అనుకూలంగా మలుచుకుంటుందో గతం అనేకసార్లు నిరూపించింది. తమ అగ్రనేతను, ఆయన కుటుంబాన్ని కించపరిచిన ప్రతి అంశాన్ని బీజేపీ నాయకులు అత్యంత చురుకుగా, వ్యూహాత్మకంగా ప్రజల్లోకి తీసుకెళ్లి భావోద్వేగాలను రగిలిస్తారు. సామాన్యులు, ముఖ్యంగా సంప్రదాయ విలువలకు కట్టుబడే ఓటర్లు ఇలాంటి అగౌరవకరమైన రాజకీయాలను అసహ్యించుకుంటారు. దీన్ని ఆయుధంగా మలచుకునేషావో, కమలనాథులు కాంగ్రెస్ పార్టీ నైతిక దిగజారుడుతనాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి రాజకీయంగా భారీ లబ్ధి పొందుతారనడంలో ఏమాత్రం సందేహం లేదు. దేశ ప్రధాని పదవికి పోటీ పడుతున్న రాహుల్ గాంధీ బాధ్యతారహితమైన వైఖరి వల్ల ఆయన ఖాతాలో మరోసారి భారీగా మైనస్ మార్కులు పడినట్లయింది. సమస్యలపై పోరాడటం మానేసి, ఇలాంటి వ్యక్తిగత దాడులు, దిగజారుడు స్కిట్‌లను ఆశ్రయించడం వల్ల ఆయన నాయకత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకం మరింత సడలిపోతోంది. బాధ్యతాయుతమైన పదవిలో ఉండాల్సిన వ్యక్తి పద్ధతి మార్చుకోకపోతే, భవిష్యత్తులోనూ కాంగ్రెస్ పార్టీకి ఇలాంటి చర్యలే పెను శాపంగా మారుతాయని ఎన్నో సార్లు నిరూపితమయింది. కానీ పాఠాలు మాత్రం నేర్చుకోవడం లేదు.

## తమిళనాడు-కర్ణాటక నడుమ కావేరి జలాల వివాదం.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..!

తమిళనాడు-కర్ణాటక రాష్ట్రాల మధ్య నెలకొన్న కావేరీ జలాల వివాదంలో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు ఇచ్చింది. కర్ణాటకకు 70 టీఎంసీల నీరు అదనంగా కేటాయించాలని కోరుతూ ఒక ప్రైవేటు సంస్థ వేసిన రిట్ పిటిషన్ ను కోర్టు కొట్టివేసింది. ప్రైవేటు సొసైటీల పిటిషన్లు చెల్లవని స్పష్టంచేసింది. అంతర్రాష్ట్ర నీటి వివాదాల్లో థర్డ్ పార్టీలు లేక సొసైటీలు జోక్యం చేసుకోలేవని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఇలాంటి పిటిషన్లను విచారిస్తూ పోతే వివాదాలు ఇంకెప్పటికి ముగుస్తాయని ప్రశ్నించింది. ఇప్పటికే కావేరీ జలాలపై తమిళనాడు, కర్ణాటక చట్టపరంగా పోరాడుతున్నాయని పేర్కొన్నది. ఈ వివాదంలో ప్రైవేటు సొసైటీలకు స్థానం లేదని, రాష్ట్రాలకే మాట్లాడే హక్కు ఉంటుందని స్పష్టంచేసింది.



తమిళనాడుకు 15 రోజులపాటు రోజూ 3500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కావేరీ నదీజలాల నిర్వహణ అథారిటీ జూలై 28న కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించింది. కావేరీ బేసిన్‌లోని నీటి లభ్యత, వర్షపాత పరిస్థితులను సమీక్షించిన తర్వాత ఈ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో తీవ్రమైన కరవు పరిస్థితులు నెలకొనడంతో తమిళనాడుకు కావేరీ జలాల విడుదలను వ్యతిరేకిస్తూ అక్కడి రైతులు, కన్నడ సంఘాలు నిరసనలు చేశాయి. ఆ నేపథ్యంలో తమిళనాడులోని విజయ్ సర్కార్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.

## విద్యార్థులకు ఉచిత అల్పాహార పథకాన్ని ప్రారంభించిన సీఎం విజయ్..



చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఇవాళ (మంగళవారం) పాఠశాల విద్యార్థుల కోసం విస్తరించిన అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. చెన్నైలోని గాంధీ గ్రామం ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో ఈ పథకానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సీఎం విజయ్ స్వయంగా అల్పాహారం వడ్డించారు. అనంతరం వారితో కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఆ తర్వాత తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కాగా, గత ప్రభుత్వం అమలు చేసిన ముఖ్యమంత్రి అల్పాహార పథకంలో టీవీకే ప్రభుత్వం పలు మార్పులు చేసింది. ఈ పథకానికి పెరుంతలైవర్ కామరాజర్ ఉచిత అల్పాహార పథకంగా పేరు మార్చింది. ఇప్పటివరకు 5వ తరగతి వరకు అమలైన ఈ పథకాన్ని తాజాగా 8వ తరగతి వరకు విస్తరించింది. ఈ మేరకు విస్తరించిన పథకాన్ని సీఎం విజయ్ నేడు ప్రారంభించారు. ఈ విస్తరణతో అదనంగా సుమారు 15.30 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15,454 ప్రభుత్వ, ప్రభుత్వ సహాయ పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ కారణంగా ప్రభుత్వంపై ఈ ఏడాది రూ.217.63 కోట్ల అదనపు భారం పడనుంది. దీంతో ఈ సంవత్సరం అల్పాహార పథకానికి ప్రభుత్వం కేటాయించిన మొత్తం నిధులు రూ.724 కోట్లకు చేరాయి. విద్యార్థులకు పోషకాహారం అందించడం, వారు ఆకలితో పాఠశాలకు రాకుండా చూడటం, వారి ఆరోగ్యం, విద్యాభ్యాసానికి తోడ్పడటం ఈ పథకం ప్రధాన లక్ష్యాలని ప్రభుత్వం తెలిపింది.

## గ్యాస్ సిలిండర్ల కొరత లేదు, పుకార్లు నమ్మొద్దు: కేంద్ర మంత్రి పూరి

న్యూఢిల్లీ ఎల్పీజీ, వంటగ్యాస్ సిలిండర్ల కొరత లేదని, కొరత ఉన్నట్లు వస్తున్న ఊహాగానాలు, వదంతులను పట్టించుకోకూడదని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి అన్నారు. వినియోగదారుల డిమాండ్లకు తగ్గట్లు ఎల్పీజీ ఉత్పత్తిని పెంచామని ఓ వార్తా సంస్థకు ఆయన తెలిపారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకోవడానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. 'హోర్ముజ్ ఇష్యూ కొంత ప్రభావం చూపిన మాట వాస్తవమే. అయితే, వంటగ్యాస్ సిలిండర్ల కొరత లేకుండా మా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇంటి అవసరాల కోసం ఉపయోగించే గ్యాస్ ఉత్పత్తిని (డొమెస్టిక్ ప్రొడక్షన్) పెంచాం. ఇంతకుముందు ఆ ఉత్పత్తి 34 వేల టన్నులు ఉండగా.. ఇప్పుడు 55 వేల నుంచి 56 వేల టన్నులకు పెంచాం.



ఎక్కడా ఎల్పీజీ కొరత లేదు. వదంతులు నమ్మి గ్యాస్ సిలిండర్ల కోసం పొడవైన క్యూలైన్లలో నిల్చోవద్దు' అని మంత్రి పేర్కొన్నారు. వంటగ్యాస్ కోసం డిజిటల్ బుకింగ్ వాడాలని వినియోగదారులకు మంత్రి హర్దీప్ సింగ్ పూరి సూచించారు. అనవసరంగా గోదాంలకు వెళ్లి గ్యాస్ తెచ్చుకోవద్దన్నారు. 'యాప్ వాడుతూ మీ ఫోన్‌లోనే వంటగ్యాస్‌ను బుక్ చేసుకోండి. 24 గంటల్లోనే మీ ఇంటికి సిలిండర్ వస్తుంది. గ్యాస్ సిలిండర్ల కొరత లేదు. కానీ, కొరత ఉన్నట్లు వస్తున్న వదంతులకు మాత్రం కొదువ లేదు' అని మంత్రి వ్యాఖ్యానించారు. వదంతుల కారణంగా చాలా మంది భయపడి అనవసరంగా ఎక్కువ సిలిండర్లను బుక్ చేసుకునే ప్రయత్నం చేశారని, దీంతో కొన్ని ఆంక్షలు విధించాల్సి వచ్చిందని ఆయన వెల్లడించారు. గురుగ్రాంలోని తన ఫ్యామిలీ ఫ్రెండ్ ఒకరు వదంతులకు భయపడి ఎక్స్ట్రా సిలిండర్లను బుక్ చేసుకున్నారని గుర్తుచేశారు. ఆయనకు గ్యాస్ పైప్ లైన్ ఉన్నా వదంతులకు ఆయన భయపడ్డారని చెప్పారు. సాధారణంగా రోజుకు సగటున 52 లక్షల ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్‌లు జరుగుతాయని, కానీ వదంతుల కారణంగా కొన్ని రోజుల పాటు బుకింగ్‌ల సంఖ్య రోజుకు 90 లక్షలకు పెరిగిందని గుర్తుచేశారు. ప్యానిక్ బుకింగ్‌లను కట్టడి చేయడానికి పంపిణీ వ్యవస్థను రేషనలైజ్ చేశామని వివరించారు.

## ఐఐటీ బాంబేలో కీలక మార్పు.. సీలింగ్ ఫ్యాన్ల స్థానంలో వాల్ మౌంటెడ్ ఫ్యాన్లు..

బీటెక్ రెండో సంవత్సరం విద్యార్థి సాహిల్ వాకోడే మృతితో తీవ్ర నిరసనలు కొనసాగుతున్న వేళ ఐఐటీ బాంబే కీలక చర్య చేపట్టింది. క్యాంపస్‌లోని హాస్టళ్లలో ఉన్న సీలింగ్ ఫ్యాన్ల స్థానంలో గోడలకు అమర్చే వాల్ మౌంటెడ్ ఫ్యాన్లను ఏర్పాటు చేయడం ప్రారంభించింది. కొత్త ఫ్యాన్ల తొలి బ్యాచ్ ఇప్పటికే క్యాంపస్‌కు చేరుకుంది. అయితే ఈ మార్పు తాజా ఘటన తర్వాత తీసుకున్న నిర్ణయం కాదని ఐఐటీ బాంబే వర్గాలు చెబుతున్నాయిహాస్టళ్లలో చేపట్టనున్న పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ఫ్యాన్లను మార్చే ప్రణాళిక ఇప్పటికే ఉందని పేర్కొన్నాయి. ఐఐటీ బాంబేలో రెండో సంవత్సరం విద్యార్థి సహిల్ వాకోడే హాస్టల్ గదిలో సెప్టెంబర్ 18న ఆత్మహత్య చేసుకున్నాడు. పరీక్షా సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించాడని, ప్రశ్నపత్రాన్ని చాట్‌జీపీటీకి అప్‌లోడ్ చేసి సమాధానాలు పొందేందుకు ప్రయత్నించాడని ఐఐటీ బాంబే తెలిపింది. సాహిల్ మృతితో విద్యార్థులు ఆందోళన ప్రారంభించారుఐఐటీ బాంబేలోని హాస్టల్ గదుల్లో ఫ్యాన్లను మార్చడం ఒక్కటే విద్యార్థుల ఆత్మహత్యల సమస్యకు పరిష్కారం కాదని కొందరు విమర్శిస్తున్నారు విద్యార్థుల మానసిక ఆరోగ్యం, ఒత్తిడి, ఫిర్యాదుల పరిష్కారం, క్యాంపస్‌లో సహాయక వ్యవస్థలను బలోపేతం చేయడంపై కూడా దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు. కాగా, సహిల్ వాకోడే మృతికి సంబంధించిన పరిస్థితులపై ప్రస్తుతం అధికారిక దర్యాప్తు కొనసాగుతోంది.

## 'గర్భిణులు, పిల్లలు పోషకాహారం తీసుకోవాలి'

**నల్లగొండ 47వ డివిజన్ కార్పోరేటర్ అబ్బగోని కవితా రమేష్**



నీలగిరి, సెప్టెంబర్ 22 : గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలతో కూడిన సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని, తద్వారా రక్తహీనతను నివారించి, ఆరోగ్య వంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని నల్లగొండ 47వ డివిజన్ కార్పోరేటర్ అబ్బగోని కవితా రమేష్ అన్నారు. జాతీయ పోషణ మాసం ఉత్సవాల్లో భాగంగా గొల్లగూడ సెక్టార్ పరిధిలోని బొయవాడ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహార అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోషణ్ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ సతీష్, సూపర్‌వైజర్ జి.సరస్వతి, అంగన్‌వాడీ టీచర్లు భారతి, ఆర్పీ, ఆశా వర్కర్లు, గ్రామ మహిళలు, గర్భిణులు, బాలింతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోషణమాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం చర్లపల్లి సెక్టార్ పరిధిలోని శివాజీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, మొలకెత్తిన గింజలు, గుడ్లతో ప్రత్యేక ఆహార ప్రదర్శనను ఏర్పాటు చేశారు. చిన్నారుల ఎత్తు, బరువులను క్రమం తప్పకుండా నమోదు చేయించుకోవాలని, మొదటి వెయ్యి రోజుల పోషణ పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు అత్యంత కీలకమని ఐసీడీఎస్ఎస్ సూపర్‌వైజర్ మర్రి జయమ్మ సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మహేశ్వరి, ప్రకృతాంబ, ఆయా సువర్ణ, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## సాగునీళ్లు ఇవ్వాలని ఇల్లందు-మహబూబాబాద్ జాతీయ రహదారిపై రైతుల ధర్నా



బయ్యారం సెప్టెంబర్ 22 : పంటలు సాగు నీళ్లు ఇవ్వాలని ఇల్లందు-మహబూబాబాద్ జాతీయ రహదారి(ఎన్ హెచ్ 930పీ) బయ్యారం బస్టాండ్ సెంటర్ వద్ద రైతులు ధర్నా చేశారు. బయ్యారం పెద్ద చెరువు ఆయకట్టు రైతులు ఈ ఏడాది వానాకాలంలో సుమారు ఆరు వేల ఎకరాల్లో పంటలు వేశారు. అయితే వర్షాలు సరిగా పడకపోవడంతో పంటలకు నీరు లేక ఎండిపోతున్నాయి. ఈ క్రమంలో బయ్యారం పెద్ద చెరువు గరిష్ఠ నీటిమట్టం 16.2 అడుగులు చేరి ఇటీవల మత్తడి పడింది. దీంతో రైతులు గత కొన్ని రోజులుగా పంటల సాగుకు నీరు అందించాలని అధికారులను కోరుతున్నారు. అధికారులు నీటి విడుదల విషయంపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో శుక్రవారం సమావేశమైన రైతులు ఆందోళనలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో బయ్యారం బస్టాండ్ సెంటర్లోని రహదారిపై గంట సేపు ధర్నా నిర్వహించారు. పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ కావడంతో అక్కడికి తాసిల్దార్ నాగరాజు, ఇరిగేషన్ డీఈ సాగర్, సీఐ రవీందర్ చేరుకొని రైతులతో మాట్లాడారు. తమ పంటలు ఎండిపోతున్న అధికారులు పట్టించుకోవడంలేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోయారు. వేల ఎకరాల పెట్టుబడి పెట్టి పంటలు సాగు ప్రారంభించామని నీళ్లు ఇవ్వకపోతే పంటలు ఎండి నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రెండు రోజుల్లో నీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని రైతులకు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

## సబ్బులు, షాంపూలు, టూత్‌పేస్టులపై వెజ్, నాన్‌వెజ్ గుర్తులు.. కేంద్రం కొత్త నిబంధనలు..

సబ్బులు, షాంపూలు, టూత్‌పేస్టులు, ఇతర సౌందర్య సాధనాలు వంటి ఉత్పత్తుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పు తీసుకొచ్చింది. ఇకపై ఈ ఉత్పత్తుల ప్యాకేజింగ్‌పై అవి శాకాహార మూలానికి చెందినవా లేదా మాంసాహార మూలానికి చెందినవా అనే విషయాన్ని తెలియజేసే గుర్తులు తప్పనిసరిగా ఉండాలి. కేంద్రం లీగల్ మెట్రాలజీ (ప్యాకేజ్డ్ కమోడిటీస్) రూల్స్, 2011కు సవరణలు చేసి ఈ మార్పును ప్రవేశపెట్టింది ఈ నిబంధనలు సోమవారం నుంచే అమల్లోకి వచ్చాయి. ఇకపై, సబ్బులు, షాంపూలు లేదా టూత్‌పేస్ట్ కొనుగోలు చేసేటప్పుడు ప్యాకేజింగ్‌పై ఉన్న ఆకుపచ్చ, ఎరుపు లేదా గోధుమ రంగు గుర్తుల ఆధారంగా ఉత్పత్తి మూలాన్ని గుర్తించవచ్చు. శాకాహార మూలానికి చెందిన ఉత్పత్తుల ప్యాకేజింగ్‌పై ఆకుపచ్చ రంగు ఉంటుంది. మాంసాహార మూలానికి చెందిన ఉత్పత్తులకు ఎరుపు లేదా గోధుమ రంగు గుర్తు ఉంటుంది. ఈ గుర్తును ప్యాకేజీ పైభాగంలో ఉంచాలిఇప్పటివరకు సబ్బులు, షాంపూలు, టూత్‌పేస్టుల తయారీలో ఉపయోగించే పదార్థాల మూలాన్ని తెలుసుకోవాలంటే వినియోగదారులు ప్యాకేజింగ్‌పై ఉన్న పదార్థాల జాబితాను పరిశీలించాల్సి వచ్చేది కొత్త నిబంధన ప్రకారం, రంగు గుర్తులతో ఉత్పత్తి శాకాహార మూలానికి చెందినదా, మాంసాహార మూలానికి చెందినదా అనే విషయాన్ని సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.


# సూపర్ సీఎంగా లోకేష్

విజయవాడ సెప్టెంబర్ 22, ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో కీల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నారా లోకేష్ పై ఇటీవలి కాలంలో కొన్ని వర్గాలు, మాజీ అధికారులు విపరీతంగా స్పందిస్తున్నారు. వినాయక చవితి ఉత్సవాల వేళ డీజేల నిర్వహణ, శబ్ద నియంత్రణపై ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తుల మేరకు హోంమంత్రికివ వినతి చేయడం ద్వారా అనుమతులు ఇప్పించారు. దీంతో ఆయన సూపర్ సీఎంగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే, ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించే క్రమంలో ఆయన చూపుతున్న క్రియాశీలక చొరవను పాజిటివ్‌గా చూడటానికి బదులు, అధికారాన్ని చెలాయిస్తున్నారంటూ రాజకీయం చేయడం వెనుక బలమైన అసూయే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది.పీవీ రమేష్‌తో పాటు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ట్విట్టర్ వేదికగా లోకేష్ ప్రాధాన్యతను ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ప్రకటనల్లో స్థానిక మంత్రుల



ఫోటోలు లేవని, లోకేష్ జోక్యం ఎక్కువైందని రోజువారీ విమర్శలు గుప్పిస్తూంటారు. ప్రభుత్వం ఓ పాలసీ పెట్టుకుంది. ఏదైనా సీఎం , పీఎం, డిప్యూటీ సీఎం ఫోటోలు మాత్రమే ఉంటాయి. దాన్ని గుర్తించడం లేదు. ఈ మాజీ అధికారుల బాధ వేరే ఉంది. ప్రభుత్వంలో తమకు అత్యంత ప్రాధాన్యత దక్కుతుందని అనుకున్నారు కానీ వారిని దూరం పెట్టారు. తమను దూరం పెట్టడానికి నారా లోకేశే కారణం అని వీరనుకుంటున్నారు. ఇలాంటి వర్గాలకు లోకేష్ వేగవంతమైన వర్కింగ్ స్టైల్ ఏమాత్రం జీర్ణమవడం లేదు. లోకేష్ గనుక తమను దగ్గరకు తీసి, తమ సొంత ఎజెండాలకు ప్రాధాన్యత ఇచ్చి ఉంటే.. ఇదే సత్వర నిర్ణయాధికారాన్ని డైనమిక్ లీడర్‌షిప్ అంటూ పొగిడేవారనడంలో సందేహం లేదు. తమకు సందు దొరకడం లేదన్న అసహనమే ఈ సూపర్ సీఎం ప్రచారానికి ప్రధాన ఇంధనంగా మారింది.నిజానికి కూటమి ప్రభుత్వంలో మంత్రిమండలి అంతా ఒకే కుటుంబంలా, ఒకే టీమ్‌లా పనిచేస్తోంది. క్షేత్రస్థాయి నుంచి వినతులు వచ్చినప్పుడు లేదా ప్రజల అత్యవసర సమస్యలు పరిష్కరించాల్సి వచ్చినప్పుడు, కేవలం తన పరిధి కాదని లోకేష్ మిన్నకుండిపోవడం లేదు. సంబంధిత శాఖా మంత్రులను ఆదేశించడం కాకుండా, వారికి పద్ధతిగా విజ్ఞప్తి చేస్తూ సమన్వయం చేసుకుంటున్నారు. వ్యవస్థలో నిర్ణయాల ప్రక్రియ వేగవంతం కావడానికి లోకేష్ తీసుకుంటున్నది బాధ్యత మాత్రమే తప్ప, అధికారం కాదనేది స్పష్టమవుతోంది. కేబినెట్ సహచరులతో సత్సంబంధాలు కలిగి ఉంటూ, ఎవరి పరిధిని ఉల్లంఘించకుండా ప్రజా సమస్యలపై దృష్టి సారించడాన్ని దురాక్రమణ గా చిత్రీకరించడం వారి అసూయేకూటమి అధికారంలోకి వచ్చాక పరిశ్రమలను రప్పించడం, విద్యా వ్యవస్థలో సంస్కరణలు తేవడం, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను స్వయంగా పర్యవేక్షించడం ద్వారా లోకేష్ తన ప్రతిభను నిరూపించుకుంటున్నారు. ప్రతిపక్షాలు సృష్టించే మైండ్ గేమ్‌లను , విమర్శకుల వ్యాఖ్యలను పట్టించుకోకుండా, ప్రభుత్వం వేగంగా పరుగెత్తేలా ఒక ఉత్ప్రేరకం లా పనిచేస్తున్నారు. నిర్ణయాధికారం జాప్యం కాకుండా సమన్వయకర్తగా వ్యవహరించడాన్ని ఆధిపత్యంగా అభివర్ణించడం అంటే.. మారుతున్న ఆధునిక రాజకీయ నాయకత్వ శైలిని అర్థం చేసుకోవడంలో విమర్శకులు విఫలమవ్వడమే. లోకేష్ సాధిస్తున్న ప్రజాదరణ, రోజురోజుకూ పెరుగుతున్న రాజకీయ ప్రాధాన్యతనే ప్రత్యర్థులకు, మాజీ అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. అధికారం చెలాయించడం వేరు, ఒక పక్కా వ్యూహంతో సమర్థవంతంగా పరిపాలనా పగ్గాలను పటిష్టం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండటం వేరు. దీన్ని విమర్శించేవారు గుర్తించాల్సి ఉంది.

# వైసీపీలో పొంచి ఉన్న సంక్షోభం...



విజయవాడ సెప్టెంబర్ 22,పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పేరు, అధికారిక గుర్తును కేంద్ర ఎన్నికల సంఘం స్తంభింపజేస్తూ తీసుకున్న నిర్ణయం దేశ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీల అధినేతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే చేతుల నుంచి శివసేన ఏక్‌నాథ్ షిండే చేతికి, శరద్ పవార్ పట్టు నుంచి ఎన్సీపీ అజిత్ పవార్ చేతికి ఎలాగైతే ప్రజాప్రతినిధుల సంఖ్యాబలం ఆధారంగా వెళ్లిపోయాయో.. ఇప్పుడు బెంగాల్‌లోనూ మమతా బెనర్జీపై రెబల్స్ పైచేయి సాధించి పార్టీని చేజిక్కించుకునే దశకు చేరుకున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాలు, చట్టపరమైన పూర్వాపరాలను పరిశీలిస్తే.. శాసనసభాపక్షంలో సంఖ్యాబలం ఉన్న వర్గానికే అసలైన పార్టీగా గుర్తింపు దక్కుతోందన్నది కాదనలేని వాస్తవంగా మారింది. ఇదే సూత్రం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనూ సరికొత్త చర్చకు ఆజ్యం పోస్తోంది.ప్రస్తుతం ఏపీ అసెంబ్లీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం కేవలం 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే. భారత రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం.. శాసనసభాపక్షంలో మూడింట రెండొంతుల మంది ప్రజాప్రతినిధులు ఒకే తాటిపైకి వస్తే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఎలాంటి అనర్హత వేటు పడదు. అంటే, మొత్తం 11 మందిలో జగన్‌ను మినహాయించి మిగిలిన 10 మంది ఎమ్మెల్యేలు గానీ, కనీసం 8 మంది సభ్యులు గానీ ఒకే మాటపై నిలబడి తిరుగుబాటు బావుటా ఎగరేస్తే చట్టపరంగా వారి సభ్యత్వాలకు ఎలాంటి ఢోకా ఉండదు. అలాంటి పరిస్థితుల్లో సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వంటి వ్యూహకర్త నాయకత్వం వహిస్తే, శాసనసభాపక్షంలో సంపూర్ణ ఆధిక్యతతో అసలైన వైఎస్సార్‌సీపీ తమదేనంటూ స్పీకర్, ఎన్నికల సంఘం ముందు వాదనలు వినిపించే సాంకేతిక వెసులుబాటు స్పష్టంగా కనిపిస్తోంది.ఒకవేళ జగన్ నియంతృత్వ ధోరణికి వ్యతిరేకంగా అసమ్మతి వర్గం బయటకు వస్తే.. పార్టీకి భావోద్వేగ పునాదులైన వైఎస్సార్ కుటుంబ సభ్యులను రంగంలోకి దించడం మరో కీలక వ్యూహం కాగలదు. జగన్ వ్యవహారశైలితో ఇప్పటికే పార్టీకి దూరమైన తల్లి వైఎస్ విజయమ్మ , రాజకీయంగా పోరాడుతున్న వైఎస్ షర్మిలను గౌరవ అధ్యక్షురాలిగానో, అధినేత్రిగానో తెరపైకి తెస్తే.. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమానులు, సంప్రదాయ ఓటుబ్యాంకును తమవైపు తిప్పుకోవడం అసమ్మతి వర్గానికి మరింత సులువవుతుంది. వైఎస్సార్ ఆశయాలు, అభిమానుల ప్రాతిపదికనే ఏర్పడిన పార్టీ కావడంతో.. కుటుంబంలో జగన్ మాత్రమే కాకుండా మిగిలిన వారికీ ఆ వారసత్వ హక్కు సహజంగానే దక్కుతుంది. ఇది పార్టీ క్యాడర్‌లో చీలికను సహజమైనదిగా మార్చేందుకు తిరుగులేని అస్త్రంగా మారుతుంది.ఎన్నికల ఓటమి తర్వాత వైఎస్ జగన్ వ్యవహరిస్తున్న ఒంటెద్దు పోకడలు, క్షేత్రస్థాయికి దూరమైన వింత రాజకీయం పార్టీ నాయకులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. గతంలో అధికారాన్ని అనుభవించిన నేతలు నేడు కేసులు, వ్యాపార నష్టాలు, రాజకీయ భవిష్యత్తు లేని శూన్యతతో కొట్టుమిట్టాడుతున్నారు. భవిష్యత్తులో పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్లాలో కార్యాచరణ లేని అధినేతను నమ్ముకుని ఉంటే తమ రాజకీయ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని పలువురు ముఖ్య నేతలు భావిస్తున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో జగన్ నీడ నుంచి బయటపడి, సొంతంగా పార్టీపై పట్టు సాధించడమో లేదా బలమైన ఫ్రంట్‌గా మారి కేంద్ర, రాష్ట్ర అధికార వర్గాలతో సంప్రదింపులు జరపడమో మాత్రమే వారి ఆస్తులను, రాజకీయ జీవితాలను కాపాడుకునే ఏకైక మార్గంగా కనిపిస్తోంది.అయితే ఈ ఫార్ములా అమలు కావడానికి ప్రధాన అవరోధం ఎమ్మెల్యేలకు ఉన్న రాజకీయ ధైర్యం. జగన్ ఆర్థిక, సామాజిక బలాల ముందు ఎదురునిలిచి బరిలోకి దిగడానికి ఎమ్మెల్యేలు ఇప్పటికీ సంశయిస్తున్నారు. కానీ, రాయలసీమలో తనకంటూ సొంత బలం, విస్తృత ఆర్థిక నెట్‌వర్క్ ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లాంటి సీనియర్ నేత గనుక తెగించి అడుగు ముందుకు వేస్తే పరిస్థితులు శరవేగంగా తలకిందులవుతాయి. మహారాష్ట్ర, బెంగాల్ ఉదంతాలు నిరూపిస్తున్నట్లుగా.. తిరుగుబాటు చేసి సంఖ్యాబలాన్ని నిరూపించుకుంటే ఎవరి చేతికైనా పార్టీ చిక్కుతుందనే భయం జగన్‌ను వెంటాడక తప్పదు. పెద్దిరెడ్డి ఆలోచన మారితే.. వైఎస్సార్‌సీపీలో పెను భూకంపం ఖాయమని అనుకోవచ్చు.

# ఏఐని శాసిస్తున్న రాజానగరం బుల్లోడు

రాజమండ్రి, సెప్టెంబర్ 22, ప్రపంచ ఏఐ రంగాన్ని ఏలుతున్న ఓపెన్ ఏఐ వంటి గ్లోబల్ టెక్ దిగ్గజ సంస్థ భద్రతా కోటలను ఛేదించడం అంటే సాధారణ విషయం కాదు. కానీ, రాజమహేంద్రవరం సమీపంలోని ఒక చిన్న గ్రామంలో ప్రభుత్వ బడిలో చదివిన తెలుగు కుర్రాడు.. తన అపారమైన నైపుణ్యంతో ఓపెన్ ఏఐ సెక్యూరిటీ సిస్టమ్స్‌లోని తీవ్రమైన లోపాలను బయటపెట్టి ప్రపంచం వైపు తన వైపు తిప్పుకున్నాడు. అతడే రాజానగరం పరిధిలోని సంపత్‌నగరానికి చెందిన పెదపాటి మోహన్ శ్రీరామకృష్ణ . సైబర్ ప్రపంచంలో "బ1తీ1బీబ"గా సుపరిచితుడు.ఈ విజయం వెనుక ఉన్న అసలైన స్ఫూర్తి అతని నేపథ్యమే. మోహన్ శ్రీరామకృష్ణ రాజమహేంద్రవరంలోని సంపత్‌నగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోనే తన ప్రాథమిక, ఉన్నత విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే విదేశీ టెక్నాలజీలు అలవడవు, కార్పొరేట్ స్కూళ్ల చదువులే ముఖ్యం అనుకునే వారికి మోహన్ సాధించిన విజయమే ఒక బలమైన సమాధానం. ఆ తర్వాత నూజివీడు ట్రిపుల్ ఐటీ నుంచి కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసిన ఆయన, కోడింగ్, సైబర్ సెక్యూరిటీపై ఉన్న ఆసక్తితో ఎథికల్ హ్యాకింగ్ రంగంలో సరికొత్త శకానికి నాంది పలికారు.మోహన్, అతని సహచరులు హర్ష్ జైస్వాల్, రాహుల్ మైనిలతో కూడిన హ్యాకథాన్ ఏఐ బృందం ఓపెన్ ఏఐ కమ్యూనిటీ ఫోరమ్స్, ఎంప్లాయ్ అకౌంట్లలో ఉన్న సెక్యూరిటీ లోపాలను ప్రయోగపూర్వకంగా నిరూపించారు. ఆంత్రోపిక్ సంస్థకు చెందిన క్లాడ్ అనే మరో ఏఐ మోడల్‌ను ఉపయోగించి, కేవలం 72 గంటల్లో, తక్కువ ఖర్చుతో ఓపెన్ ఏఐ సిస్టమ్‌లోని ప్రైవేట్ గిట్ హబ్ రిపాజిటరీ వరకు యాక్సెస్ సాధించి గ్లోబల్ టెక్ వర్గాలను ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఒక ఎథికల్ హ్యాకర్‌గా ఈ భద్రతా లోపాలను గుర్తించిన వెంటనే వారు ఓపెన్ ఏఐ ప్రతినిధులకు సమగ్ర నివేదికను అందించి సిస్టమ్‌ను మరింత పటిష్టం చేయడానికి సహాయపడ్డారు. దీనికిగాను ఓపెన్ ఏఐ నుంచి రివార్డ్సతో పాటు అంతర్జాతీయ గుర్తింపును పొందారు.చాలామంది టెక్ నిపుణులు ఇటువంటి విజయాలు సాధించాక విదేశాలకు వెళ్లడానికో లేదా మెట్రో నగరాల్లో సెటిల్ అవ్వడానికో ప్రాధాన్యత ఇస్తారు. కానీ, మోహన్ మాత్రం తన సొంత జిల్లాలోనే ఉంటూ ఐటీ రంగంలో అద్భుతాలు సృష్టించవచ్చని నిరూపించారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం కేంద్రంగానే ఇశ్రీవఃబితీసీలసీశ్రీబి ఎనిటసీబవఃఇ' అనే సైబర్ సెక్యూరిటీ సంస్థను స్థాపించి ప్రపంచ స్థాయి క్లయింట్లకు పెనెట్రేషన్ టెస్టింగ్, సైబర్ ఆడిటింగ్ సేవలను అందిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ సైబర్ సెక్యూరిటీ ఆడిటింగ్ సంస్థల్లో ఒకటైన బెర్లిన్‌కు చెందిన అబీతీవ53లో సీనియర్ ఆడిటర్‌గా పనిచేస్తూనే, రాజానగరంలోని తన ఆఫీస్ నుంచే అంతర్జాతీయ స్థాయి ఆపరేషన్లను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ బడిలో చదివినా, ప్రతిభకు పేదరికం లేదా ప్రాంతం అడ్డుకాదని, కష్టపడే తత్వంతో గ్లోబల్ లెవెల్‌లో సత్తా చాటవచ్చని మోహన్ శ్రీరామకృష్ణ జీవితం నిరూపిస్తోంది.

# పుట్ట బద్దలు కొడుతున్న రావణ్....

గుంటూరు, సెప్టెంబర్ 22,పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని సాగించిన విషప్రచారం, రాజ్యాంగ వ్యవస్థలపై చేసిన తీవ్ర వ్యాఖ్యల కేసులో కస్టడీలోకి తీసుకున్న జోసఫ్ రావణ్ విచారణలో నోరు విప్పినట్లు తెలుస్తోంది. తనను ముందుపెట్టి నడిపించిన అసలు సూత్రధారుల జాతకాలను, కుట్ర కోణాలను పోలీసుల ఎదుట పూసగుచ్చినట్లు వెల్లడిస్తున్నట్లు చెబుతున్నారు. సోషల్ మీడియా వేదికగా సమాజంలో అలజడులు సృష్టించేలా, ఆర్మీ కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం వెనుక ఉన్న పొలిటికల్ హ్యాండ్లర్ల వివరాలను ఆరా తీస్తున్న అధికారులకు రావణ్ సంచలన వివరాలను అందించినట్లు సమాచారం.ముఖ్యంగా జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యంగా సాగిన వ్యక్తిత్వ హనన కార్యక్రమాలు, దానికి అందిన ఫండింగ్ మూలాల గుట్టు ఇప్పుడు విచారణలో పూర్తిగా రట్టవుతోంది. తాను ఒక వ్యూహం ప్రకారం ఎందుకు పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకోవాల్సి వచ్చింది, డిజిటల్ క్యాంపెయిన్లు నడిపేందుకు నిధులు ఎక్కడి నుంచి ప్రవహించాయి అనే అంశాలపై రావణ్ స్పష్టమైన సమాచారం ఇచ్చాడని తెలుస్తోంది. తాను ఆవేశంలో చేసిన వ్యాఖ్యల వెనుక కొంతమంది వైసీపీ నేతల ఆర్థిక సహకారం, తాము మేధావులం అని చెప్పుకునే కొందరు వ్యూహకర్తల ప్రోత్సాహం బలంగా ఉందనే విషయాన్ని ఒప్పుకున్నట్లు సమాచారం.గతంలో మావోయిస్టులు, నక్సలైట్లకు మద్దతుగా మాట్లాడటం, జాతీయ భద్రతకు ముప్పు కలిగించేలా ఆర్మీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం వెనుక ఉన్న నెట్‌వర్క్ నెమ్మదిగా వెలుగులోకి వస్తోంది. తనను రెచ్చగొట్టి, సోషల్ మీడియా వేదికగా తీవ్రమైన కేసుల్లో ఇరుక్కునేలా చేసిన పెద్దలు ఇప్పుడు స్పందించకపోవడం, తనను ఒంటరిని చేయడంతో రావణ్ కస్టడీలో పోలీసుల అడిగిన ప్రశ్నలకు ఏమాత్రం దాచకుండా సమాధానాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. చట్టపరమైన చిక్కుల నుంచి తప్పించుకోవడానికి ఏకైక మార్గంగా అప్రూవర్‌గా మారే యోచనలో ఉన్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.రావణ్ ఇచ్చిన కస్టడీ వాంగ్మూలం ఆధారంగా రాబోయే రోజుల్లో ఏపీ పోలీస్ యంత్రాంగం కీలక చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉంది. కేవలం మైక్ ముందుకు వచ్చి మాట్లాడిన వ్యక్తులనే కాకుండా, తెరవెనుక ఉండి ఫండింగ్ చేసిన వైసీపీ నేతలకు, ప్రోత్సహించిన ఇతర వ్యక్తులకు నోటీసులు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రావణ్ బయటపెట్టిన సమాచారంతో, ఇన్నాళ్లూ సోషల్ మీడియా వేదికగా ఫేక్ నెరేటివ్‌లు నడుపుతూ వ్యవస్థలపై దాడికి దిగిన అసలు సిసలు దొంగలకు శాస్తి జరగడం ఖాయంగా కనిపిస్తోంది.

# బద్వేల్‌లో మరో రహదారి అభివృద్ధికి శ్రీకారం

బద్వేలు బద్వేల్ మున్సిపాలిటీ:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కడప రోడ్డు నుంచి భాకరాపేట వరకు 2.3 కిలోమీటర్ల రహదారి నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మరియు ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన మంచూరు సూర్యనారాయణ రెడ్డి విచ్చేసి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.1.26 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నారు. రహదారి నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు, బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలో రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. బద్వేల్ నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంచూరు సూర్యనారాయణ రెడ్డి తెలిపారు.

# రేణిగుంటలో శ్రీ బాలాజీ మెడికల్ కాలేజీలో ఘనంగా 6వ జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలు....

**ఔషధాల హేతుబద్ధమైన వినియోగం పై అవగాహన...**

**ఉత్సాహంగా విద్యార్థుల వాక్ థాన్......**

**సురక్షితమైన ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ఫార్మాకో విజిలెన్స్ వారోత్సవాలు.....**

రేణిగుంట: సెప్టెంబర్ 22, వైద్య రంగంలో ఔషధాల సురక్షిత వినియోగంపై ప్రజల్లో మరియు విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు రేణిగుంట శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ మరియు రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో 6 వ జాతీయ ఫార్మాకో విజిలెన్స్ వారోత్సవాలు అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సెప్టెంబర్ 22వ తేదీన ప్రత్యేకంగా ఒక భారీ వాక్ థాన్ నిర్వహించారు. ఫార్మాకో విజిలెన్స్ ద్వారా ఔషధాల హేతుబద్ధమైన వినియోగాన్ని ప్రోత్సహిద్దాం... సురక్షితమైన ఆరోగ్య సంరక్షణకు ఒక అడుగు"అనే నినాదంతో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. మందులను ఇష్టానుసారంగా వాడడం వల్ల కలిగే నష్టాలు, వాటి సరైన మోతాదు మరియు దుష్ప్రభావాలపై అవగాహన కల్పించే ప్లకార్డులను విద్యార్థులు ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో వైద్య విద్యార్థులు విశేష ఉత్సాహాన్ని కనబరిచారు. ఎంబిబిఎస్, బిపిటి మరియు నర్సింగ్ విద్యార్థులతో పాటు పలువు అధ్యాపకులు ఈ వాక్ థాన్ లో భాగస్వాములయ్యారు. ప్రతి ఒక్కరూ ఔషధ సురక్షిత వాడకంపై నినాదాలు చేస్తూ పరిసర ప్రాంతాల్లో ప్రజలకు సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా సంస్థ డీన్ ఎం హనుమంతరావు డైరెక్టర్ ఎం నాగరాజు జేఈవో డాక్టర్ ఎం నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో వైద్య సేవలతో పాటు మందుల దుర్వినియోగాన్ని అరికట్టడం ఎంతైనా అవసరమని పేర్కొన్నారు. ఫార్మా కాలేజీ విభాగ ప్రొఫెసర్ హెడ్ మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ సి మాధవ్ మాట్లాడుతూ ఫార్మా కోవిజిలెన్స్ ప్రాముఖ్యతను ఔషధాల వల్ల కలిగే దుష్ప్రభావాలను ఏ విధంగా ఎప్పటికప్పుడు ఎలా రిపోర్ట్ చేయాలో వివరించారు.

# తు కష్టం తెలుసుకుని.. సొంత నిధులతో మోటార్ల మరమ్మతులు..

**కాట్రేనిపల్లి పంపింగ్ స్కీమ్‌లో 4 మోటార్లకు రూ.6 లక్షలతో మరమ్మతులు**

**రైతుల 600 ఎకరాల సాగుభూములకు సాగునీరు విడుదల చేసిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

నందిగామ: రైతన్నలు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వెంటనే స్పందించి కాట్రేనిపల్లి పంపింగ్ స్కీమ్‌లోని నాలుగు మోటార్లకు మరమ్మతులు చేయించారు. దాతలు, ఎమ్మెల్యే సౌమ్య సహకారంతో సుమారు రూ.6 లక్షల సొంత నిధులతో మోటార్లను రిపేర్ చేయించి, రైతుల సాగుభూములకు నీరు అందేలా చర్యలు చేపట్టారు. మరమ్మతులు పూర్తయిన అనంతరం కాట్రేనిపల్లి పంపింగ్ స్కీమ్ వద్ద అధికారులు, రైతు నాయకులు, రైతులతో కలిసి మోటార్లను స్విచ్ ఆన్ చేసి సాగునీటిని విడుదల చేశారు. దీంతో సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతుల్లో ఆనందం వ్యక్తమైంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ.. రైతు సమస్యను కేవలం అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోనే ఆగిపోకుండా, అవసరమైనప్పుడు తన వంతు సహకారం అందించి పరిష్కరించడమే ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని అన్నారు. రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో మోటార్ల మరమ్మతులకు దాతల సహకారంతో పాటు తన వంతుగా నిధులు సమకూర్చినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు స్థానికంగా కూడా సహకారం అందిస్తామని సౌమ్య గారు పేర్కొన్నారు. రైతు పొలానికి నీరు చేరితేనే పంట పండుతుందని, రైతు కుటుంబం ఆర్థికంగా బలపడుతుందని అన్నారు.రైతుల అవసరాలకు అనుగుణంగా పంపింగ్ స్కీమ్‌ను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, మోటార్లు సక్రమంగా పనిచేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో లాల్ బహుదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, సంబంధిత అధికారులు, రైతు నాయకులు, కూటమి నేతలు, దాతలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మూడు రోజులపాటు ఉత్తరాంధ్రలో వర్ష సూచన

విశాఖపట్నం,ఉత్తరాంధ్ర జిల్లాల్లో సెప్టెంబర్ 22 నుంచి 25 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధి కారులు తెలిపారు. బంగాళాఖా తంలో కొనసాగుతున్న అల్పపీడ నం పశ్చిమ–వాయువ్య దిశగా కదులుతూ మరింత బలప డనుంది.సెప్టెంబర్ 21న వాయు గుండంగా, 22న తీవ్ర వాయు గుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచ నా వేసింది. సెప్టెంబర్ 23 ఉద యం ఉత్తరాంధ్ర?దక్షిణ ఒడిశా తీరానికి సమీపించే అవకాశం ఉంది.

# శ్రీవారి గరుడసేవలో ఆర్టీసీ సేవలు అభినందనీయం.

**జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావుకు సత్కారం..?**

తిరుపతి: సెప్టెంబర్ 22,గత శనివారం తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగిన గరుడసేవకు ఆర్టీసి అధికారులు పక్కా ప్రణాళికతో బస్సులను నడిపి, ప్రయాణీకులకు అత్యంత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఆర్.ఎం. శ్రీనివాస రావును ఆర్టీసీ నాయకులు అంబేద్కర్ స్టార్ కృష్ణ, ఆవుల ప్రభాకర్ యాదవ్, వర్మ, శ్రీనాథ్ తదితరులు ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కండువాతో సత్కరించి ఘనంగా అభినందించారు. ?ఈ విజయవంతమైన ప్రస్థానంలో నెల్లూరు ఈడీ జగదీష్, డిప్యూటీ సీటీఎం విశ్వనాథ్, డిప్యూటీ సీఎంఈ బాలాజీ, అన్ని డిపోల మేనేజర్లు మరియు అన్ని స్థాయిల ఉద్యోగులు, ముఖ్యంగా డ్రైవర్, కండక్టర్లు సమన్వయంతో పని చేసి గరుడసేవను దిగ్విజయవంతం చేశారని నాయకులు కొనియాడారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించి, వచ్చే నెలలో నిర్వహించబోయే శ్రీవారి బ్రహ్మోత్సవాలను కూడా విజయవంతం చేయాలని ఆర్.ఎం. శ్రీనివాసరావు ఈ సందర్భంగా అందరినీ కోరారు.

# ట్రాఫిక్ స్టేషన్‌పై ఎస్పీ తనిఖీ--

## ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబరు 22: నంద్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. పట్టుబడిన వాహనాల వివరాలు, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు.ప్రమాద కేసుల దర్యాప్తు, సిబ్బంది విధుల కేటాయింపు, డ్యూటీ రోస్టర్, సాధారణ డైరీ, ఎఫ్ఐఆర్ రికార్డులను ఎస్పీ పరిశీలించారు. పట్టణంలోని ప్రధాన ట్రాఫిక్ ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు.మద్యం సేవించి వాహనాలు నడపడం, ఇతర ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రమాదాల నివారణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా నిరంతరం చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యానికి ఆదేశించారు.

# గోరుకల్లు పరిస్థితిపై అప్రమత్తం--

## వెంట్‌గేట్ ఘటనపై విచారణ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబరు 22: పాణ్యం మండలం గోరుకల్లు గ్రామంలో నెలకొన్న పరిస్థితులపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. మంగళవారం గోరుకల్లు గ్రామాన్ని సందర్శించి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.గోరుకల్లు రిజర్వాయర్ వెంట్‌గేట్ ఎవరు తెరిచారనే అంశంపై సమగ్ర విచారణ జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. బాధ్యులుగా తేలిన వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వరదల కారణంగా నష్టం జరిగిన ప్రాంతాలను గుర్తించి పునరుద్ధరణ పనులు చేపట్టాలని, పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు.పంట నష్టంపై క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గోరుకల్లు పరిసర ప్రాంతాల్లో నీటిమట్టం సుమారు మూడు అడుగులు ఉన్నందున ఇరిగేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# రక్త సంబంధీకుల వ్యాపారాలతో సంబంధం లేదు--

## దుష్ప్రచారాలను నమ్మొద్దు: గోళ్ల రాజేష్--


విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 22: తన వ్యాపార లావాదేవీలకు రక్త సంబంధీకులకు చెందిన వ్యాపార సముదాయాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రముఖ వ్యాపారవేత్త, సామాజికవేత్త గోళ్ల రాజేష్ స్పష్టం చేశారు. తనపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు.తాను 2000 సంవత్సరం నుంచి వ్యక్తిగత కారణాలతో రక్త సంబంధీకులకు, వారి వ్యాపార లావాదేవీలకు



దూరంగా ఉన్నానని తెలిపారు. గత మూడేళ్లుగా తన వ్యాపార ఆదాయంలో కొంత భాగాన్ని నంద్యాల నియోజకవర్గ ప్రజల కోసం సేవా, సంక్షేమ కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్లు చెప్పారు. టెక్కే మార్కెట్ యార్డులో ఇటీవల సూపర్ మార్కెట్‌ను ప్రారంభించామని, పేద, మధ్యతరగతి ప్రజలకు నిత్యావసర సరుకులను 15 శాతం రాయితీతో అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని గోళ్ల రాజేష్ తెలిపారు.

# కన్నుల పండుగగా జరిగిన ఆర్యవైశ్య జిల్లా, మండల, మండల మహిళా సంఘ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం..

## - జై వాసవి జై జై వాసవి నామస్మరణతో అట్టహాసంగా కార్యక్రమం జరిగినది..



విభారే న్యూస్ సెప్టెంబర్ 22 ఎమ్మిగనూరు..స్థానిక వాసవి కళ్యాణ మండపం నందు కన్నుల పండుగగా ఆర్యవైశ్య జిల్లా, మండల, మహిళా సంఘాల ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగినది. ఈ కార్యక్రమమునకు రాష్ట్ర మహిళా సంఘ అధ్యక్షురాలు శ్రీమతి కే రజిని, రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు సిద్ధ పద్మావతి, రాష్ట్ర కోశాధికారి గుండా నాగ సుప్రజ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీమతి ఉషా రాధిక వీరి అధ్యక్షతన కార్యక్రమం కన్నుల పండుగగా జరిగినది. కర్నూలు జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బిలేహాలు భాస్కర్ శెట్టి ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభకు మంత్రాలయం నుండి ఐదు మందిని ఎన్నిక చేసి రాష్ట్ర మహాసభకు జిల్లా మహిళా సంఘం ఎమ్మిగనూరు మహిళా సంఘం, ఎమ్మిగనూరు మండల సంఘం, నందవరం మహిళా సంఘం, నందవరం మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులందరూ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఎమ్మిగనూరు మండల ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలుగా శ్రీమతి తక్కశిల విష్ణుప్రియ, మండల కార్యదర్శిగా శ్రీమతి మిరియాల శ్రీలక్ష్మి, కోశాధికారిగా శ్రీమతి బిలేహాలు ప్రవళి, గౌరవాధ్యక్షురాలుగా శ్రీమతి బిలేహాలు సుమంగళ, శ్రీమతి తల్లం కవిత, ఉపాధ్యక్షురాలుగా




శ్రీమతి కల్కి జ్యోతి, శ్రీమతి బిలేహాలు మమత, ఉప కార్యదర్శిగా శ్రీమతి కొండా సాయి హేమలత, శ్రీమతి కెఎం జాహ్నవి మరియు 12 మంది కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మిగనూరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా కొండా సూర్యనారాయణ ఆర్యవైశ్య సంఘ ప్రధాన కార్యదర్శిగా గొంది శ్రీరామ్, మండల ఆర్యవైశ్య సంఘ కోశాధికారిగా తక్కశిల మణికంఠ, గౌరవాధ్యక్షులు, గౌరవ సలహాదారులు, ఉపాధ్యక్షులు, ఉప కార్యదర్శిలు, కార్యవర్గ సభ్యులు అందరూ ప్రమాణస్వీకారం గావించారు.

# నంద్యాలకు నిధుల వరద--

## ఆరు పట్టణాలకు రూ.164 కోట్లు.. నంద్యాలకు రూ.63 కోట్లు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబరు 22: నంద్యాల జిల్లాలోని ఆరు పట్టణాల మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.164 కోట్లు కేటాయించిందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. ఈ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా




శంకుస్థాపన చేశారు.కేటాయించిన నిధుల్లో నంద్యాల పట్టణానికి రూ.63 కోట్లు, ధోన్‌కు రూ.21 కోట్లు, ఆళ్లగడ్డకు రూ.21 కోట్లు, ఆత్మకూర్‌కు రూ.21 కోట్లు, నందికొట్కూర్‌కు రూ.21 కోట్లు, బేతంచెర్లకు రూ.17 కోట్లు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.నంద్యాల పట్టణానికి కేటాయించిన నిధులతో పాటు వివిధ పథకాల నిధులను అనుసంధానం చేసి సుమారు రూ.550 కోట్లతో సమగ్ర అభివృద్ధి చేపట్టనున్నట్లు తెలిపారు. మంచినీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీలు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు, పార్కులు, పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యం ఇస్తామన్నారు.స్వచ్ఛ, ఆరోగ్యకర నంద్యాల నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ఇంటింటి చెత్త సేకరణకు సహకరించాలని కలెక్టర్ కోరారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం--

## కేసుల పరిష్కారంపై కలెక్టర్ ఆదేశం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబరు 22: ఎస్సీ, ఎస్టీ వర్గాల బాధితుల కేసుల విచారణను వేగవంతం చేసి సకాలంలో న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్‌తో కలిసి



జిల్లా విజిలెన్స్, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కేసుల పురోగతి, బాధితులకు అందుతున్న పరిహారం, సహాయ చర్యలపై సమీక్షించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు బాధితులకు ప్రభుత్వ సహాయం సకాలంలో అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సమావేశంలో అదనపు ఎస్పీ ఖాదర్ బాషా, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివారెడ్డి, కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# హానికర వ్యర్థాలపై పర్యవేక్షణ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 22–: హానికర వ్యర్థాల నిర్వహణ, పరిశ్రమల పర్యవేక్షణపై ఏపీఈఎంసీఎల్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి కర్నూలులోని కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ, జోనల్ కార్యాలయాల్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలోని అసెన్షన్ మెర్కంటైల్ ప్రైవేట్ లిమిటెడ్ హానికర వ్యర్థాల ప్రీ–ప్రాసెసింగ్ యూనిట్‌ను తనిఖీ చేశారు. వ్యర్థాల నిర్వహణ, రవాణా, సిమెంట్ పరిశ్రమలకు తరలింపు ప్రక్రియను పరిశీలించి, రికార్డులు, ఏపీఈఎంసీఎల్ అంతర్జాల వేదికలోని వివరాలను ధృవీకరించారు. జీపీఎస్ ఆధారిత వ్యర్థాల రవాణా పర్యవేక్షణ వ్యవస్థను పరిశీలించారు. పర్యావరణ నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కే. రమేష్, పి.వి. కిషోర్‌రెడ్డి, ఏపీఈఎంసీఎల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హాజరుపై ప్రత్యేక దృష్టి--

## అకడమిక్ ప్రగతిని పర్యవేక్షించాలి--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబరు 22: జిల్లాలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విద్యాశాఖ అధికారులను, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఆదేశించారు. నంద్యాల పట్టణంలోని మానవ వనరుల కేంద్రంలో ఎంఈఓలు–1, 2 జిల్లా స్థాయి వన్డే శిక్షణ కార్యక్రమంలో అకడమిక్ ప్రగతిపై కలెక్టర్ సమీక్షించారు.పాఠశాలలకు క్రమం తప్పకుండా హాజరుకాని విద్యార్థులను గుర్తించి, వారి కుటుంబ పరిస్థితులను పరిశీలించి తల్లిదండ్రులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు వినూత్న బోధనా పద్ధతులను అవలంబించాలని, ఎంఈఓలు పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి హాజరు, విద్యా ఫలితాలను సమీక్షించాలని ఆదేశించారు. సమావేశంలో డీఈఓ జనార్దన్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ లీలావతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు 'శక్తి' భరోసా--

## ఆత్మకూరులో 200 మంది విద్యార్థులకు అవగాహన--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబరు 22: మహిళలు, బాలికల భద్రత, బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శక్తి బృందం సుమారు 200 మంది విద్యార్థులకు అవగాహన కల్పించింది. జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశాల మేరకు డీఎస్పీ రామాంజినాయక్ సూచనలతో, సీఐ ఓ. మహేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు.శక్తి యాప్‌తో పాటు అత్యవసర నంబర్లు 112, 100, 181, 1098, 1930 వినియోగంపై వివరించారు. బాల్యవివాహాలు, పోక్సో చట్టం, సైబర్ మోసాల నివారణపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, హెల్మెట్ ధరించాలని సూచించారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**